సాక్షి
మంచిర్యాల

మంగళవారం । 17 । జనవరి । 2023



సింగరేణిలో ట్రాన్స్‌ఫర్ పాలిటిక్స్!

సింగరేణిలో రాజకీయం జోక్యం రోజురోజుకూ పెరుగుతోంది. తాజాగా రామకృష్ణాపూర్‌లోని ఏరియా ఆసుపత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజరమేశ్‌ను రెండ్రోజుల క్రితం ఆకస్మికంగా బదిలీ చేయడం చర్చనీయాంశమైంది. 8లో▸



సంక్రాంతి వేళ.. సైకిల్ రేస్

హాజీపూర్ మండలం గుడిపేటలో సంక్రాంతి వేళ నిర్వహించిన సైకిల్ రేస్ చిన్నారుల్లో ఉత్సాహం నింపడమే కాదు ఊరంతా సందడి వాతావరణం నెలకొంది. మొత్తం 70 మంది చిన్నారులు పోటీల్లో పాల్గొన్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
33.1 /16.3

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉదయం పొగమంచు అధికంగా కురుస్తుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలి ప్రభావం కాస్త తగ్గుతుంది.

న్యూస్‌రీల్

అక్రమ కట్టడాల కూల్చివేత



అక్రమ కట్టడాలు కూల్చి వేయిస్తున్న తహసీల్దార్

నస్పూర్: పట్టణ పరిధిలో అక్రమ కట్టడాలను తహసీల్దార్ జ్యోతి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది జేసీబీతో సోమవారం కూల్చివేయించారు. నస్పూర్ శివారు 72 ప్రభుత్వ భూమి తాళ్లపల్లి ఆర్అండ్ఆర్ కాలనీ సమీపంలో కట్టిన రెండు షెడ్లను, శ్రీపాద కాలనీలో తోళ్ల వాగు బఫర్‌జోన్‌లో నిర్మించిన ప్రహరీని తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపట్టొద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ మాంతయ్య, మండల సర్వేయర్ సాయికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ గణన చేపట్టాలి



మాట్లాడుతున్న గుమ్ముల శ్రీనివాస్

పాతమంచిర్యాల: బీసీ జన గణన రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టాలని బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ కోరారు. జిల్లా కేంద్రంలోని జన్మభూమి నగర్‌లో బీసీ సంఘాల నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. బీహార్ రాష్ట్రంలో మాదిరిగా తెలంగాణలోనూ కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా బీసీ జన గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీ జన గణన కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపామని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. యూపీలో బీసీల లెక్కలు లేనందున స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను న్యాయస్థానం కొట్టేసిందని తెలిపారు. అదే తరహాలో మధ్యప్రదేశ్‌లో కూడా చేశారని గుర్తుచేశారు. తెలంగాణలో 34 శాతం ఉన్న రిజర్వేషన్లు 18 శాతానికి కుదించారన్నారు. దేశంలో 07 శాతం ఉన్న అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తే 60 శాతం ఉన్న బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కూడా లేకపోవడం సరికాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ జనగణనపై దోబూచులాడకుండా బీసీలకు అన్నిరంగాల్లో సమాన వాటా దక్కేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీసీ ఐక్య వేదిక జిల్లా కోకన్వీనర్ సంగం లక్ష్మణ్, నాయకులు కంచర్ల కొమురయ్య, జంబోజి శ్రీనివాస్, బేర అశోక్, నజీం పాల్గొన్నారు.

ఆదాయ పన్ను రీయింబర్స్ చేయాలి

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వి.సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులకు ఆదాయ పన్ను ను రీయింబర్స్ చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వి.సీతారామయ్య డిమాండ్ చేశారు. ఎస్సార్పీ 1 గనిపై సోమవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. ఎన్నికల ముందు టీఆర్ఎస్‌ను గెలిపిస్తే కార్మికులకు పెర్క్స్‌పై ఐటీని మాఫీ చేయిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు పట్టించుకోవడం లేదని తెలిపారు. దేశంలో ఏ పరిశ్రమల్లో పెరగనంతగా వేతనాలు పెంచామన్నారు. బొగ్గు గనులను ప్రైవేటు పరంచేస్తూ కార్మిక సంఘాలను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వంతో తాము కొట్లాడి 19 శాతం వేతనాలు పెంచేలా ఒప్పించామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచీ సెక్రెటరీ మెత్కూరి కొమురయ్య, నాయకులు మారపెల్లి బాపు, శ్రీనివాస్, అనంతరెడ్డి, పరశురాములు, రాజేంద్రప్రసాద్, పాషా పాల్గొన్నారు.

మున్సిపల్ ఫైళ్ల పరిశీలన



ఫైళ్లను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ గౌతమి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలోని ఫైళ్లను ట్రైనీ కలెక్టర్ పి.గౌతమి సోమవారం పరిశీలించారు. ట్రైనింగ్‌లో భాగంగా మున్సిపాలిటీలోని పలు విభాగాల్లో చేపడుతున్న పనుల గురించి మున్సిపల్ మేనేజర్ కె.విజయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయా విభాగాలకు సంబంధించిన ఫైళ్లు, రికార్డులు తనిఖీ చేశారు.

ఈ ఫొటోలో కనిపిస్తున్న ఐదంతస్తుల భవనం జిల్లా కేంద్రం రామ్‌నగర్‌లోనిది. గతంలో ఈ భవనం శిథిలావస్థకు చేరిందని స్థానికులు ఫిర్యాదు చేస్తే, ధ్రువపత్రాలు తీసుకు రావాలని గతేడాది మే నెలలో మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చారు. అయితే అనుమతి లేకుండా మళ్లీ ఆ అధికారుల పరోక్ష సహకారంతోనే శిథిల భవనం కూల్చకుండానే దొడ్డిదారిలో నిర్మించాడు. ఇటీవల ఈ భవనం నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని బీఎస్పీ నాయకులు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ భవన నిర్మాణం పూర్తి చేసేలా ఓ అధికారికి సైతం డబ్బులు అందాయని నాయకులు ఆరోపించారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది నస్పూర్ పోలీసు స్టేషన్ పక్కనే జాతీయ రహదారిని అనుకుని చేపట్టిన భారీ నిర్మాణం. నివాస స్థలాల కోసం అనుమతి తీసుకుని ఓ వ్యాపార సముదాయం నిర్మిస్తున్నారు. మున్సిపల్ అధికారులు భవన నిర్మాణ సమయంలో అనుమతి తిరస్కరించినా పనులు మాత్రం ఆగ లేదు. పట్టణంలో ఎవరైనా పేద, మధ్య తరగతి వాళ్లు నిర్మిస్తే ఆగమేఘాలపై వచ్చి అధికారులు నిర్మాణాలు కూల్చివేస్తారు. ఈ నిర్మాణంపై మాత్రం అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు.



క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధి ప్రధాన రహదారిని అనుకుని గద్దెరాగడి శివారులో మందమర్రికి చెందిన ఓ టీబీజీకేఎస్ నాయకుడు ఐదంతస్తుల భవనం నిర్మించాడు. అయితే ఈ నిర్మాణానికి ఎటువంటి అనుమతి లేదు. ఇప్పటికే భవనం పూర్తయి, వ్యాపార, వాణిజ్య అవసరాల కోసం అద్దెకు ఇచ్చేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి.

అంతా మాఇష్టం!

- అనుమతులు మాకెందుకు?
- పట్టణాల్లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- అనుమతులు లేకుండా భారీ అంతస్తులు
- నిబంధనలు ఉల్లంఘిస్తున్నా చర్యలు కరువు
- నోటీసులకే పరిమితమవుతున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అనుమతులు లేకుండానే పట్టణాల్లో అనేక భవనాలు వెలుస్తున్నాయి. పేద, మధ్యతరగతి ప్రజలపై ఓ తీరుగా రాజకీయ నాయకులు, పలుకుబడి, డబ్బు ఉన్న వ్యక్తులపై మరో తీరుగా అధికారులు వ్యవహరిస్తున్నారు. కొందరు రూ. కోట్లు వెచ్చించి, నిబంధనలు తుంగలో తొక్కుతూ అంతా మా ఇష్టం అన్నట్లుగా కనీస అనమతులు లేకుండానే భారీ అంతస్తులు నిర్మిస్తున్నారు. నిర్మాణ దారులెవరైనా టీఎస్ బీపాస్‌లో అనుమతులకు దరఖాస్తు చేసుకోవాలి. నిర్మాణ దారులే 'సెల్ఫ్ సర్టిఫికేషన్' చేసుకుని ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు, సర్టిఫికెట్లు అప్‌లోడ్, ప్రాసెసింగ్ ఫీజులు చెల్లించాలి. 75 గజాలలోపు ఇంటి నిర్మాణాలకు అనుమతులు అవసరం లేదు. ఆపైన నిర్మించే భవనాలకు తప్పనిసరిగా అ నుమతులు పొందాలి. కానీ జిల్లాలో చాలా చోట్ల అ నుమతులు లేకుండానే భవనాలు వెలుస్తున్నాయి. కొందరు నివాసం పేరుతో వ్యాపార కేంద్రాల కోసం భవనాలు కట్టేస్తున్నారు. సెల్ఫ్ సర్టిఫికేషన్‌లోనూ లోపాలు కనిపిస్తున్నాయి. అన్ని ధ్రువపత్రాలను, క్షేత్రస్థాయిలో నిర్మాణాన్ని పరిశీలించాకే సంబంధిత పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు అనుమతులు ఇవ్వాలి. కానీ కొన్నిచోట్ల మాత్రం నిక్కచ్చిగా ఉంటూ మరికొన్ని భవనాలపై ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

ఏడు మున్సిపాలిటీల్లో ఉల్లంఘనలు

జిల్లాలో ఏడు మున్సిపాలిటీల్లో నిబంధనల ఉల్లంఘనలతో నిర్మాణాలు సాగుతున్నాయి. జిల్లా కేంద్రం మంచిర్యాల పట్టణంలో వాగులు, వంకలు, నాలాలపై నిర్మాణాల సాగుతున్నాయి. ప్రధాన మార్కెట్‌లో కనీస నిబంధనలు పాటించకుండా బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారు. రూ.లక్షల్లో అద్దెలు తీసుకుంటూ షాపింగ్ మాల్స్ ముందు వాహన పార్కింగ్ సౌకర్యం, సెట్ బ్యాక్, ఫైర్ సేఫ్టీ, వరద నీటి నియంత్రణ, సెల్లార్ వదిలివేయడం వంటి నియమాలు పాటించడం లేదు. బెల్లంపల్లి, క్యాతనపల్లి పరిధిలో సింగరేణి, ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లోనూ నిర్మాణాలు జరుగుతున్నాయి. మందమర్రిలో ఏజెన్సీ చట్టం అమలులో ఉన్నా.. భారీ భవనాలు, షాపింగ్ మాల్స్, ఫంక్షన్ హాళ్లు నిర్మిస్తున్నారు. కొత్తగా ఏర్పడిన చెన్నూరు, లక్షెట్టిపే, క్యాతనపల్లి మున్సిపాలిటీల్లోనూ పాత రికార్డుల్లోనే అనుమతులు పొందినట్లు చూపుతూ నిర్మాణాలు చేపడుతున్నారు. నివాస భవనాల పేరుతో కమర్షియల్ భవనాలు నిర్మిస్తున్నారు.

నోటీసులకే పరిమితం..

ఏడు మున్సిపాలిటీల్లో అనుమతి లేకుండా వెలుస్తున్న కట్టడాలపై పట్టణ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. బెల్లంపల్లి పట్టణంలో అనుమతి లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న 75 మందికి నోటీసులు అందజేశారు. మంచిర్యాల మున్సిపాలిటీలో 20 మందికి, నస్పూర్ మున్సిపాలిటీలో 8 మందికి, లక్షెట్టిపేటలో 20 ఇళ్లకు, చెన్నూర్‌లో 120 ఇళ్లకు, మందమర్రి మున్సిపాలిటీలో 36 నిర్మాణాలకు, క్యాతనపల్లి మున్సిపాలిటీలో 11 మందికి మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చారు. నిర్ణీత సమయంలో స్పందించకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చు. ఆ నిర్మాణాలను కూల్చివేయవచ్చు. అయితే టాస్క్‌ఫోర్స్ కమిటీలు నామమాత్రంగా మారిపోవడంతో అక్రమ నిర్మాణదారులకు భయం లేకుండా పోతోంది.

ఎస్టీపీపీని సందర్శించిన జడ్జీలు

జైపూర్: మండల కేంద్రంలోని 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటును జిల్లా జడ్జీల బృందం కుటుంబసమేతంగా సోమవారం సందర్శించింది. మంచిర్యాల ప్రధాన జూనియర్ సివిల్ కోర్టు జడ్జి టి.మహతివైష్ణవి, జిల్లా మొదటి అదనపు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి డి.ఉపనిషద్వాని, చెన్నూర్ సివిల్ కోర్టు జడ్జి సి.సంపత్ ఎస్టీపీపీ సందర్శించి విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియ, బాయిలర్లు, బీవో ఏరియాలోని చిమ్నీ, కూలింగ్ టవర్లు, డీఎం ప్లాంటు తదిత నిర్మాణాలను పరిశీలించారు. రెండు యూనిట్లలోని బాయిలర్లలో విద్యుత్ ఉత్పత్తి జరిగే ప్రక్రియను కంట్రోల్ రూం ద్వారా వీక్షించారు. బొగ్గును మండి నీరును ఆవిరిగా మార్చే ప్రక్రియలో విద్యుత్ ఉత్పత్తికి తోడ్పడే ప్రదాన యంత్రం టర్బైన్ పని తీరును అధికారులు వివరించారు. జడ్జీల బృందంతో ఎస్టీపీపీ పర్సనల్ మేనేజర్ కేసా నారాయణరావు ఉన్నారు.

ఆర్కే-6 గని సందర్శన



ఆర్కే 6 గనిలోకి దిగుతున్న జడ్జీలు

శ్రీరాంపూర్: సింగరేణి శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఆర్కే-6 గనిని జిల్లా కోర్టులకు సంబంధించిన పలువురు జడ్జీలు సందర్శించారు. వారి వెంట సింగరేణి స్టాండింగ్‌కౌన్సిల్ అడ్వకేట్ ఎ.శ్యాంకిశోర్, బెల్లంపల్లి రీజియన్ లాఆఫీసర్ ప్రభందిత, ప్యానెల్ అడ్వకేట్ మల్లారెడ్డి ఉన్నారు. ముందుగా వీరికి గని మేనేజర్ కార్యాలయంలో ఏజెంట్ ఏవీ.రెడ్డి, గని మేనేజర్ ఈ తిరుపతి గని మైనింగ్ ఆపరేషన్స్‌ను మ్యాప్ ద్వారా వివరించారు. అనంతరం వారు భూగర్భంలోకి దిగి పనిస్థలాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. బొగ్గు ఉత్పత్తి, రవాణా, రక్షణ చర్యలు పరిశీలించారు. కార్యక్రమంలో గని రక్షణాధికారి శ్రీనివాస్, వెంటిలేషన్ అధికారి వీరన్న, సంక్షేమ అధికారి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

వృత్తి శిక్షణ.. ఉపాధికి రక్షణ



రాజీవ్‌నగర్‌లోని జామతోటను పరిశీలిస్తున్న విద్యార్థులు

- జిల్లాలో పది పాఠశాలల్లో అమలు..

మంచిర్యాలఅర్బన్: పాఠశాలస్థాయిలో విద్యార్థులకు చదువుతోపాటు స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన పెంచేలా పాఠశాల విద్యాశాఖ వృత్తివిద్యా కోర్సులు అందుబాటులోకి తెచ్చింది. విద్యార్థులకు ఆసక్తి ఉన్న కోర్సుల్లో నైపుణ్యం పెంచే దిశగా చర్యలు చేపట్టింది. మొదట 2017లో జిల్లాలో ఐదు ఆదర్శ పాఠశాలల్లో వృత్తి కోర్సులు ప్రవేశపెట్టారు. 2022లో ఐదు జిల్లా పరిషత్ పాఠశాలల్లో వివిధ కోర్సులు అందుబాటులోకి తెచ్చారు. పాఠశాల స్థాయిలో పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా విద్యార్థులకు భవిష్యత్‌పై భరోసా కల్పించేలా అదనపు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఏదైనా అంశంలో వృత్తి విద్యగా రోజుకు గంటపాటు శిక్షణ ఇస్తున్నారు.

ఎన్ఎస్‌డీసీ చేయూత..

ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో వృత్తి విద్యా కోర్సుల నిర్వహణకు జాతీయ నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్(ఎన్ఎస్‌డీసీ) చేయూతనందిస్తోంది. పాఠశాల విద్యాశాఖ, వృత్తివిద్య శిక్షణ భాగస్వామ్యంతో నిర్వహించే ఈ కోర్సులకు కేంద్ర వృత్తి విద్యాశాఖ చేయూతనందిస్తోంది. విడతలవారీగా ఆయా పాఠశాలల్లో కోర్సులు ప్రవేశపెట్టారు. 9, 10, ఇంటర్ విద్యార్థులకు కోర్సులు అమలు చేస్తున్నారు. నూతన విద్యావిధానం అమల్లోకి వస్తే 6 నుంచి ఇంటర్ వరకు కోర్సులు అందుబాటులోకి రానున్నాయి.

వృత్తివిద్య కోర్సులు ఇలా..

ఆయా పాఠశాలల్లో పలు రకాల వృత్తివిద్య కోర్సులు ఉన్నప్పటికీ ఒక్కో పాఠశాలలో రెండు ట్రేడ్‌లలో శిక్షణ ఇప్పిస్తున్నారు. చదువుతోపాటు పాటు వృత్తి విద్య అంశాలపై శిక్షణతోపాటు విద్యార్థులు స్థిరపడే అవకాశం ఉంది. రిటేల్, అగ్రికల్చరల్, బ్యూటీ, వెల్‌నెస్, అపరెల్స్, హెల్త్‌కేర్, మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్, ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఐటీ కోర్సుల్లో ఒప్పంద ఉపాధ్యాయులతో శిక్షణ ఇప్పిస్తున్నారు. వీరికి అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేయించి అవగాహన కల్పిస్తున్నారు.

క్షేత్రస్థాయి పర్యటనతో అవగాహన..

విద్యార్థులకు వృత్తివిద్య కోర్సుల్లో ఒకటైనా అగ్రికల్చరల్‌లో భాగంగా మంచిర్యాల ఆదర్శ పాఠశాలను ఎంపిక చేశారు. కోర్సులు ఎంపిక చేసుకున్న విద్యార్థులకు వ్యవసాయంలో దుక్కులు దున్నటం నుంచి మొదలుకుని మార్కెటింగ్ వరకు తర్ఫీదు ఇవ్వటంతోపాటు క్షేత్రస్థాయి పర్యటన చేస్తున్నారు. సేంద్రీయ విధానంలో రాజీవ్‌నగర్‌లో సాగుచేస్తున్న జామతోటను సందర్శించారు. మొక్కలు ఎలా నాటాలి వాటికి అవసరమైన పోషక పదార్థాలు ఎప్పుడు అందించాలనే విషయాలపై ఫీల్డ్ ట్రిప్ నిర్వహించారు. జీవామృతం తయారీపై తర్ఫీదు ఇచ్చారు.

బడ్జెట్ విడుదల..

రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో వృత్తి విద్యాకోర్సులు నిర్వహిస్తుండటంతో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. పాఠశాల విద్యాశాఖ నుంచి వృత్తివిద్య సామగ్రి కొనుగోలుకు బడ్జెట్ విడుదలైంది. ప్రతీ పాఠశాలలకు రూ.48 వేల చొప్పున మంజూరయ్యాయి. ఆయా సామగ్రి కొనుగోలు చేయనుండటంతో విద్యార్థులకు సౌకర్యంగా మారనుంది. కోర్సుల్లో చేరిన విద్యార్థులకు భవిష్యత్తులో స్వయం ఉపాధికి మార్గం సుగమం అవుతుంది.

– వెంకటేశ్వర్లు, డీఈవో, మంచిర్యాల

ఎంపిక చేసిన పాఠశాలలు, వాటిలో అందుబాటులో ఉన్న కోర్సులు..

పాఠశాల	కోర్సులు
టీఎస్ఎంఎస్ దండేపల్లి	హెల్త్‌కేర్, మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్
టీఎస్ఎంస్ కాసిపేట	ఎలక్ట్రానిక్స్, హార్డ్‌వేర్
టీఎస్ఎంస్ కోటపల్లి	ఎలక్ట్రానిక్స్, హార్డ్‌వేర్
టీఎస్ఎంస్ మంచిర్యాల	అగ్రికల్చర్, రిటైల్
టీఎస్ఎంఎస్ మందమర్రి	మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్, అపరెల్స్
జెడ్పీహెచ్ఎస్ బజార్‌ఏరియా	ఎలక్ట్రానిక్స్, హార్డ్‌వేర్, అపరెల్స్
జెడ్పీహెచ్ఎస్ భీమారం	బ్యూటీ, వెల్‌నెస్, అపరెల్స్
జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్, చెన్నూర్	బ్యూటీ, వెల్‌నెస్, అపరెల్స్
జెడ్పీహెచ్ఎస్ కిష్టాపూర్	అగ్రికల్చరల్, రిటైల్
జెడ్పీహెచ్ఎస్ తాండూర్	ఐటీ, ఐటీఈఎస్, అపరెల్స్

తెరుచుకోనున్న ఎంసీహెచ్

- గత జులై 12న వరదలో మునక
- నాటి నుంచి జీజీహెచ్‌లోనే వైద్య సేవలు
- ఈనెల 18న పునఃప్రారంభించేందుకు ఏర్పాట్లు



ఎంసీహెచ్‌లో చేస్తున్న మరమ్మతులు

మంచిర్యాలటౌన్: జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలతోపాటు, మాతాశిశు మరణాలు లేకుండా ఉండాలని గతేడాది మార్చి 4న రూ.17.80 కోట్లతో కాలేజీ రోడ్డులోని గోదావరి నది ఒడ్డున నిర్మించిన మాతాశిశు ఆరోగ్య కేంద్ర(ఎంసీహెచ్) భవనాన్ని ప్రారంభించారు. వైద్య సేవలను అదే ఏడాది మే నెలలో ప్రారంభించారు. రెండు నెలలకే(జులై 12న) భారీ వర్షాలకు గోదావరి ఉప్పొంగడంతో ఎంసీహెచ్ నీట మునిగింది. అంతకు ముందు రోజే ఆసుపత్రిలోని బాలింతలు, గర్భిణులు, శిశువులను ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్)కి తరలించారు. వరదలో మునిగిన ఎంసీహెచ్ భవనంలో సామగ్రి తడిసి పాడైంది. నెలల తరబడి ఎంసీహెచ్‌కు తాళం వేసి ఉంచడంతో అందులోని ఏసీలు, విద్యుత్ పరికరాలు, ఇతర సామగ్రి దొంగలు ఎత్తుకెళ్లారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుబంధంగా కొనసాగుతున్న ఎంసీహెచ్ భవనాన్ని తిరిగి వినియోగంలోకి తీసుకు వచ్చేందుకు ఇటీవల మరమ్మతులు చేపట్టారు. ఈనెల 18 నుంచి ఓపీ సేవలను ప్రారంభిస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చందర్‌రెడ్డి తెలిపారు.

ఎన్ఎంసీ బృందం వస్తుందనే

ప్రస్తుతం ఎంసీహెచ్ భవనం వరద తాకిడికి గురైపాడైన వాటికి మరమ్మతులు చేస్తున్నారు. కేవలం గదులను మాత్రమే ఇప్పటికీ సిద్ధం చేయగా, ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్లు, బాలింతలు ఉండేందుకు అవసరమైన వార్డును సిద్ధం చేయాల్సి ఉంది. నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్ఎంసీ) వారు మంచిర్యాల మెడికల్ కాలేజీ అనుమతుల పరిశీలనకు త్వరలో జిల్లాకు వచ్చే అవకాశం ఉంది. దీంతో 18 నుంచి ఎంసీహెచ్‌లో ఓపీ సేవలను ప్రారంభించి, ఆ తరువాత ప్రసవాలను చేసేలా చర్యలను తీసుకుంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 250 పడకలతో ఎంసీహెచ్ విభాగాన్ని నిర్వహించడం కష్టంగా ఉంది. ఎన్ఎంసీ తనిఖీల్లో 330 పడకల ఆసుపత్రి తప్పనిసరిగా ఉండాలి. జీజీహెచ్ నుంచి ఎంసీహెచ్‌ను సొంత భవనంలోకి మార్చడం వలన జీజీహెచ్‌లో 200, ఎంసీహెచ్‌లో 130 పడకలు మొత్తంగా 330 పడకల ఆసుపత్రిని ఎన్ఎంసీ వారికి చూపే అవకాశం ఉంది. ఊరికి దూరంగా ఎంసీహెచ్ ఉండగా, ఓపీ సేవలకు గర్భిణులు వెళ్లి రావడం భారంగా మారనుంది. ఆర్టీసీ బస్సును వేస్తేనే పేదలపై భారం తగ్గుతుంది.

'కంటివెలుగు'లో భాగస్వాములు కావాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ భారతి హోళ్లికేరి



వీసీ ద్వారా మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే రెండో విడత కంటివెలుగు కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని, అధికార యంత్రాంగం ప్రజాప్రతినిధులు సమష్టిగా విజయవంతం చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు సూచించారు. ఖమ్మం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇన్‌చార్జి డీజీపీ అంజనీకుమార్‌తో కలిసి కలెక్టర్లు, వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈనెల 18న ముఖ్యమంత్రి కేసీఆర్ ఖమ్మంలో కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. 19న ఉదయం 9 గంటలకు రాష్ట్ర అన్ని జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులతో కార్యక్రమాన్ని ప్రారంభించేలా అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొంటున్న అధికారులు వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేయాలని, ప్రతీ మండలంలో ప్రత్యేక అధికారి, వైద్య, ఆరోగ్యశాఖ అధికారుల సమన్వయంతో శిబిరాల నిర్వహణను పర్యవేక్షించాలని తెలిపారు. కంటి పరీక్ష చేసిన వెంటనే అవసరం ఉన్నవారికి కంటి అద్దాలు అందించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ భారతి హోళ్లికేరి మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహణకు జిల్లాలో 40 బృందాలు, ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అనుసంధానించడం జరిగిందని తెలిపారు. కంటి సమస్య ఉన్న ప్రతి ఒక్కరికి పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుబ్బరాయుడు. జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జున్, ఏడు మున్సిపాలిటీల కమిషనర్లు, కంటి వెలుగు నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు చేయాలి

మంచిర్యాల అగ్రికల్చర్: ఈనెల 19న జిల్లాలో ప్రారంభం కానున్న కంటివెలుగు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ భారతి హోళ్లికేరి సూ చించారు. అదనపు కలెక్టర్ బి.రాహుల్‌తో కలిసి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీ పోలీసు శాఖలు, సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈనెల 19న జిల్లా వ్యాప్తంగా అన్ని శిబి రాలు ఒకే సమయంలో ప్రారంభించేలా చర్యలు తీ సుకోవాలన్నారు. పరీక్షల నిర్వహణ సక్రమంగా ఉండేలా కార్యచరణ రూపొందించుకోవాలని తెలిపారు. మున్సిపాలిటీలు, గ్రామాలు, చౌకధరల దుకాణాలు, ప్రధాన కూడళ్లు, ప్రభు త్వ కార్యాలయాల వద్ద హోర్డింగ్‌లు, పోస్టర్ల ద్వారా శిబిరాల వివరాలు తెలిపేలా ప్రచారం చేయాలని వివరించారు. శిబిరం నిర్వహించే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు.

సోలార్ విద్యుత్ యూనిట్లకు స్త్రీనిధి రుణాలు

పాతమంచిర్యాల: సోలార్ విద్యుత్ యూనిట్ల ఏర్పాటుకు మహిళా సంఘాల సభ్యులకు గ్రామీణాభివృద్ధి శాఖ కసరత్తు చేస్తోంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా థర్మల్ విద్యుత్ వినియోగం తగ్గించడానికి స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన కల్పించి సోలార్ విద్యుత్ యూనిట్లు నెలకొల్పుకో వాలని సూచిస్తున్నారు గ్రామీణాభివృద్ధిశాఖ అధికా రులు. సోలార్ యూనిట్లు స్థాపించుకోవడానికి సబ్సిడీ రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపా రు. జిల్లాలో 300 సోలార్ యూనిట్లు మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆసక్తి కలిగిన మహిళా సంఘాల సభ్యులు దరఖాస్తు చేసుకో వాలని సూచిస్తున్నారు. ఇందుకోసం 2 కిలోవాట్, 3 కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానెళ్ల కొనుగోలుకు రూ.లక్ష నుంచి రూ.1.25 లక్షల సబ్సిడీ రుణాలు మంజూరు చేయనున్నారు. సోలార్ యూనిట్ కోసం సబ్సిడీ రుణాన్ని 5 ఏళ్లలో(60 నెలలు) వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుంది. సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకున్న వారు తమ గృహ అవసరాలకు సోలార్ విద్యుత్‌ను వాడుకుని మిగతా సోలార్ పవర్‌ను విద్యుత్ గ్రిడ్‌కు అమ్ముకునే సౌకర్యాన్ని కల్పిస్తున్నామని అధికారులు తెలిపారు. 2 కిలో వాట్ సామర్థ్యం కలిగిన సోలార్ యూనిట్ ధర రూ.1,42,200 కాగా సబ్సిడీ రూ.39,200, 3 కిలో వాట్ సోలార్ యూనిట్ ధర రూ.1,92,360 సబ్సిడీ రూ.57,360 ఉంటుందని వివరించారు. కాగా, సో లార్ ప్యానెళ్లకు 25 ఏళ్ల వారంటీ ఉంటుందని తెలిపారు. ప్రతీ మండలానికి 35 సోలార్ యూనిట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన మహిళా సంఘాల సభ్యులు దరఖాస్తు చేసుకోవాలని డీఆర్డీఏ అధికారులు సూచించారు.

రైల్వే క్రికెట్ విజేత ఎంప్లాయీస్ సంఘ్

బెల్లంపల్లి: గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ఆవరణలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ విజేతగా నిలిచింది. రైల్వే ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఎంప్లాయీస్ సంఘ్ టీమ్ విన్నర్‌గా నిలవగా, రన్నర్‌గా లోకో రన్నింగ్ స్టాఫ్ నిలిచింది. ఇరుజట్ల క్రీడాకారులను ఎంప్లాయీస్ సంఘ్ కార్యదర్శి శివప్రసాద్ అభినందించారు. విజేతలకు ఈనెల 26న జరిగే గణతంత్ర వేడుకల్లో బహుమతులు ప్రదానం చేస్తారు.



విన్నర్ ఎంప్లాయీస్ సంఘ్ టీం క్రీడాకారులు

క్లుప్తంగా

ప్రైవేట్ డెయిరీ నిర్వాహకులకు రిమాండ్

బెల్లంపల్లి: డెయిరీ నిర్వహణ పేరుతో బెల్లంపల్లి ప్రాంత రైతుల వద్ద రూ.లక్షలు వసూలు చేసి మోసానికి పాల్పడిన ఆరిజిన్ డెయిరీ నిర్వాహకులు ఇద్దరిని పోలీసులు రిమాండ్‌కు పంపారు. ఆరిజిన్ డెయిరీ నిర్వాహకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా సంతమగులురు మండలం చౌటుపాలెం గ్రామానికి చెందిన కందిమల్ల ఆదినారాయణ అలియాస్ హరిబాబు అలియాస్ హరికిషన్, అనంతపురం జిల్లా గంగవరం గ్రామానికి చెందిన బోయపాటి షేజల్ అలియాస్ నందినిని ఈ నెల 13వ తేదీన బెల్లంపల్లిలో అరెస్టు చేసినట్లు మంచిర్యాల ఇన్‌చార్జి డీసీపీ అఖిల్ మహాజన్ ప్రకటించారు. ఆ నిందితులను మరుసటి రోజు 14వ తేదీ శుక్రవారం చెన్నూర్ కోర్టులో పోలీసులు ప్రవేశపెట్టారు. సదరు నిందితులను న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించడంతో ఆదిలాబాద్ జిల్లా జైలుకు పోలీసులు తరలించారు.

చోరీకి యత్నం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని వేంపల్లి గ్రామ శివారులో గల జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దొంగలు చొరబడి చోరీకి ప్రయత్నిస్తుండగా పట్టుబడ్డారు. చోరీకి పాల్పడుతున్న గుర్తు తెలియని ఇద్దరి వ్యక్తులను గమనించిన అసోసియేషన్ భవన మేనేజర్ చెట్టిపల్లి గట్టయ్య వెంటనే తేరుకుని స్థానికులకు సమాచారం అందించి అప్రమత్తమయ్యాడు. దొంగలు రెండు ఏసీలు తీసి ఉంచడంతో హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌కు కూడా సమాచారం ఇచ్చాడు. తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లిన దొంగలను బయటకు రాకుండా తలుపులు వేసి లోపలే బంధించారు. సమాచారం అందుకున్న ఎస్సై ఉదయ్‌కిరణ్ అసోసియేషన్‌కు చేరుకుని అప్పటికే పట్టుకుని ఉన్న దొంగలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పశువుల కాపరి అనుమానాస్పద మృతి

జైపూర్: మండలంలోని ఇందారం శివారులో రామారావుపేట గ్రామానికి చెందిన పశువుల కాపరి దొర్ల కిష్టయ్య(50) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. స్థానిక ఎస్సై రామకృష్ణ కథనం ప్రకారం.. నడిపల్లి ప్రవీణ్‌రావు లారీ యార్డు పక్కన ఉన్న ఓంప్రకాశ్ లవ్‌ఓటీ భూమిలో ఆదివారం సాయంత్రం బర్లు మేపుకుంటూ వెళ్లి అనుమానాస్పద స్థితిలో పడి వుండగా స్థానికులు గమనించి సమాచారం ఇచ్చారన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడి

కౌటాల(సిర్పూర్): కౌటాల మండలం వైగాం గ్రామ శివారులో పేకాట స్థావరంపై ఆదివారం రాత్రి కౌటాల బుద్దె స్వామి, ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో దాడిచేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి రూ.9వేలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కాగజ్‌నగర్ మండలంలో ఆరుగురిపై కేసు..
కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం బోడపల్లి శివారులో సోమవారం పేకాట ఆడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.23 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సింగరేణిలో ట్రాన్స్‌ఫర్ పాలిటిక్స్!



సింగరేణి ఏరియా ఆస్పత్రి ఎదుట రాస్తారోకో చేస్తున్న నాయకులు

- ఆర్కేపీ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆకస్మిక బదిలీ
- వచ్చే ఎన్నికల్లో చెన్నూర్ నుంచి పోటీచేసే చాన్స్
- బదిలీ వెనుక రాజకీయ కోణం ఉందని విమర్శలు

రామకృష్ణాపూర్: సింగరేణిలో రాజకీయం జోక్యం రోజురోజుకూ పెరుగుతోందా అంటే అవుననే అంటున్నాయి కార్మిక సంఘాలు. ఇప్పటికే అధికారిక కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని యాజమాన్యం ఆదేశించింది. ఇదే అదునుగా సంస్థ విస్తరించి ఉన్న జిల్లాలు, నియోజకవర్గాల్లో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు సంస్థ కార్యకలాపాల్లో జోక్యం చేసుకుంటున్నారు. క్వార్టర్ల కేటాయింపు, బదిలీలను ప్రభావితం చేస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా రామకృష్ణాపూర్‌లోని ఏరియా ఆసుపత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజరమేశ్‌ను రెండ్రోజుల క్రితం ఆకస్మికంగా బదిలీ చేయడం చర్చనీయాంశమైంది. ఖమ్మం జిల్లా ఎల్లందుకు బదిలీ చేయడం వెనుక రాజకీయ జోక్యం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాపతినిధి ఒత్తిడితో ఉన్నతాధికారులు బదిలీ చేశారని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.


డాక్టర్ రాజరమేశ్

మూడేళ్లుగా విధి నిర్వహణ..
2019 జూన్‌లో రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలో రాజరామేశ్ విధుల్లో చేరారు. కోవిడ్ విజృంభించిన సమయంలో కొందరు వైద్యులు సెలవుపై వెళ్లినప్పటికీ రాజరమేష్ లీవు పెట్టకుండా అత్యుత్తమ వైద్య సేవలందించి సంస్థ ఉన్నతాధికారుల మన్ననలు పొందాడు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఆయన విధి నిర్వహణలో చిత్తశుద్ధి ప్రదర్శించటమే కాకుండా పలు సేవా కార్యక్రమాలతో ప్రజల్లో తనదైన ముద్ర వేసుకున్నారనే అభిప్రాయాలు ఉన్నాయి.

రాజకీయాల్లోకి వస్తాడన్న అనుమానంతోనే..
డాక్టర్ రాజరమేశ్ త్వరలో రాజకీయ అరంగేట్రం చేస్తారనే ప్రచారం జరుగుతోంది. ఏ పార్టీలోకి వెళ్తారనేది ఇంకా స్పష్టత లేకపోయినప్పటికీ ఖమ్మం జిల్లాకు చెందిన ఓ మాజీ ఎంపీతో రాజరమేశ్‌కు సత్సంబంధాలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవల రాజరమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప పడిపూజ మహోత్సవంలో కూడా ఆ మాజీ ఎంపీ పాల్గొనటం చర్చానీయాంశమైంది. ఎస్సీ వర్గానికి చెందిన రాజరమేశ్ రాజకీయాల్లోకి వచ్చి.. చెన్నూర్ నియోజకవర్గం నుంచి ఏదైనా పార్టీ నుండి బరిలోకి దిగితే కచ్చితంగా తమకు బలమైన ప్రత్యర్థి అవుతారన్న ఉద్దేశ్యంతో అధికార పార్టీ నాయకులే బదిలీ చేయించారని విపక్ష పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు. బదిలీ నిలిపివేయని పక్షంలో లాంగ్‌లీవ్ పెట్టి మరింతగా ప్రజలకు చేరువై ఎన్నికల సమయానికి అధికార పార్టీకి దీటుగా నిలిచే ఏదైనా ఓ పార్టీలో చేరి చెన్నూర్ అసెంబ్లీ బరిలో పోటీ చేసే అవకాశాలున్నాయని అంటున్నారు. ఏదేమైనా రాజరమేశ్ పొలిటికల్ ఎంట్రీకి ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలుస్తోంది.

బదిలీ నిలిపివేయాలని ఆందోళన


బంద్‌తో మూసిఉన్న దుకాణాలు

రామకృష్ణాపూర్: సింగరేణి రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజరమేశ్‌ను ఆకస్మికంగా బదిలీ చేయడంపై విపక్ష నాయకులు ఆదివారం స్థానిక కోల్‌బెల్ట్ రహదారిపై ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ రాజరమేశ్ కోవిడ్ విజృంభిస్తున్న సమయంలో ప్రాణాలకు తెగించి సెలవులు పెట్టకుండా విధులు నిర్వర్తించారని గుర్తుచేశారు. తన సోదరి పేరిట జీఎస్‌ఆర్ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న డాక్టర్‌కు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక అధికార పార్టీ నాయకులే బదిలీ చేయించారని ఆరోపించారు. వెంటనే బదిలీ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. డాక్టర్ బదిలీని నిరసిస్తూ సోమవారం పట్టణ బంద్ నిర్వహించారు. వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. దుకాణాలు మూసివేసి డాక్టర్ బదిలీ నిలిపివేయాలని నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మహంకాళి శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అక్బర్ అలీ, ఐఎన్‌టీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు తేజావత్ రాంబాబు, మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పొన్నాల సాగర్, నాయకులు మల్లయ్య, శ్రీనివాస్, పాలరాజు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఫౌండేషన్‌తో సేవా కార్యక్రమాలు...
ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో డాక్టర్ రాజరమేశ్ తన సోదరి పేరిట జీఎస్‌ఆర్(గొడిసెల సురేఖరాజ్) ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. దానిద్వారా ఆపదలో ఉన్న వారికి, అనాథలకు చేయూతనందిస్తున్నారు. పలువురికి ఆర్థిక సహాయం కూడా చేశారు. ఈ నేపథ్యంలో ఉన్నట్టుండి బదిలీ చేయటంపై స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ విధుల్లో చేరి మూడేళ్ల అవుతున్నా అకస్మాత్తుగా బదిలీ చేయటంపై సింగరేణి కార్మిక సంఘాల ప్రతినిధులు, విపక్ష పార్టీల నేతలు మండిపడుతున్నారు.

హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏరియా నాయకులు పోచం, శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 29న భద్రాద్రి కొత్తగూడెంలో నిర్వహించే సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐ రాష్ట్ర మహాసభల పోస్టర్ సోమవారం గోలేటిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను ఐక్యం చేసి, యూనియన్ కార్మికుల హక్కులు, వేతనాల కోసం పోరాటాలు చేస్తోందన్నారు. పోరాటాల ఫలితంగానే కనీస వేతనం, పీఎఫ్, ఆసుపత్రి, పనిభద్రత, బోనస్‌లాంటి అనేక హక్కులు సాధించుకున్నామని పేర్కొన్నారు. అదే తరహాలో ఒకటో కేటగిరీ వేతనం, పర్మినెంట్, గ్రాట్యూటీ వంటి సమస్యలను 11వ వేజ్‌బోర్డు ఒప్పందంలో ప్రధాన ఎజెండాగా పెట్టి చర్చించాలని ఉద్యమాలు చేపట్టామన్నారు. కొత్తగూడెంలో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభల్లో భవిష్యత్ కార్యాచరణ రూపొందించటంతో పాటు కొత్త నాయకత్వాన్ని ఎన్నుకుంటారని తెలిపారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థులు వర్షిత్, సంజీవ్ రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను సోమవారం అభినందించి ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లో ఈ నెల 21, 23 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.

కోడి పందేల స్థావరాలపై దాడులు

- పలువురిపై కేసు నమోదు

దహెగాం(సిర్పూర్): దహెగాం మండల కేంద్రంతోపాటు గొర్రెగుట్ట గ్రామంలో కోడి పందేల స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు మండల కేంద్రంలో కోడి పందేల స్థావరంపై ఆదివారం దాడి చేసి రెండు పందెం కోళ్లు, రూ.2,000 నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. మొర్లె తిరుపతి, బుర్రి రాములు, చింతపూడి పున్నం, పుల్గం సంతోష్, గురిజాల వెంకన్న, వనపర్తి రాజు, జర్పుల కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అలాగే మండలంలోని గొర్రెగుట్ట సమీపంలో రెండు పందెం కోళ్లు, రూ.2,150 నగదు స్వాధీనం చేసుకుని ఆరుగురిపై కేసు నమోదు చేశామని తెలిపారు. శ్రీరాముల ఎల్లయ్య, బకాం రాము, బొక్క వెంకటేశ్వర్‌రావు, బొక్క కోటేశ్వర్‌రావు, దార లస్మయ్య, వస్తం బాలరాజుపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మండలం భూపాలపట్నం గ్రామ శివారులో శనివారం సాయంత్రం కోడి పందేల స్థావరంపై దాడులు నిర్వహించినట్లు ఎస్సై దీకొండ రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎనిమిది మందిని పట్టుకుని, రూ.8,100 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే పారిగాం గ్రామ శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్న పది మందిపై కేసు నమోదు చేశామన్నారు. నిందితుల వద్దరూ.13,030 నగదుతోపాటు నాలుగు పందెం కోళ్లు, మూడు కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు


గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న పీవో వరుణ్‌రెడ్డి

- ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి

ఉట్నూర్: ఆదివాసీ గిరిజనుల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ గిరిజనుల అర్జీలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలన్నారు. ఈనెల 21న ప్రారంభం కానున్న నాగోబా జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఇక్కడకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. మంగళవారం మెస్రం వంశీయులు వడమరకు పవిత్ర గంగాజలాలతో చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ భీంరావ్, ఏపీవో పీటీజీ భాస్కర్, ఏవో రాంబాబు, హెచ్‌వో సుధీర్, జేడీఎం నాగభూషణం, డీపీవో ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలి వద్దకు వెళ్లి..
తనకు మూడు చక్రాల స్కూటీ మంజూరుతోపాటు స్థానికంగా నివాసం ఉండేందుకు ఐటీడీఏ క్వార్టర్ ఇప్పించాలని దివ్యాంగురాలు గద్దం భీంబాయి అర్జీ పెట్టుకునేందుకు ఐటీడీఏకు చేరుకుంది. నడవలేని స్థితిలో ఉన్న ఆమె వద్దకు ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి నేరుగా వెళ్లి అర్జీ స్వీకరించారు. ఆమెకు న్యాయం జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.


దివ్యాంగురాలి వద్దకు చేరుకుని అర్జీ స్వీకరిస్తున్న పీవో

సంక్రాంతి వేళ.. సైకిల్ రేస్

- చిన్నారుల్లో ఉత్సాహం నింపిన పోటీలు


గుడిపేటలో సైకిల్ రేస్ విజేతలతో ఎస్సై, ఎంపీపీ, వైస్ ఎంపీపీ


గుడిపేటలో సైకిల్ రేస్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేటలో సంక్రాంతి వేళ నిర్వహించిన సైకిల్ రేస్ చిన్నారుల్లో ఉత్సాహం నింపడమే కాదు ఊరంతా సందడి వాతావరణం నెలకొంది. సంక్రాంతి పురస్కరించుకుని యువరాజ్యం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అండర్-15, అండర్-13, అండర్-10 విభాగాల్లో సైకిల్ రేస్ నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి మొత్తం 70 మంది చిన్నారులు పోటీల్లో పాల్గొన్నారు. పోటీలను హాజీపూర్ ఎంపీపీ మండపల్లి స్వర్ణలత, వైస్ ఎంపీపీ బేతు రమాదేవి జెండా ఊపి ప్రారంభించారు. ఐదు రౌండ్లలో పోటీలు జరగగా ఫైనల్ పోరు ఉత్కంఠభరితంగా సాగింది. విజేతలకు ఎంపీపీ స్వర్ణలత, వైస్ ఎంపీపీ రమాదేవి, హాజీపూర్ ఎస్సై ఉదయ్‌కిరణ్ బహుమతులు ప్రదానం చేశారు. అండర్-15 విభాగంలో మొదటి విజేతగా నిలిచిన గెల్లు సిద్ధుకు రూ.3 వేల నగదు, రన్నర్ మల్యాల అభినయ్‌కు రూ.2 వేల నగదు, తృతీయస్థానంలోనిలిచిన మడిపెల్లి సిద్ధుకు రూ.వెయ్యి అందించారు. అండర్-13 విభాగంలో మొదటి బహుమతి జేబీ.హర్మన్‌కు రూ.1,500, రన్నర్ కియాన్స్‌కు రూ.వెయ్యి, తృతీయ స్థానంలో నిలిచిన విజేత విష్ణుకు రూ.500 నగదు, అండర్-10 విభాగంలో ఫస్ట్‌ప్రైజ్ అత్తె మోక్షజ్ఞకు రూ.500 నగదు అందజేశారు. ఈ బహుమతులను ఎంపీపీ మండపల్లి స్వర్ణలత-శ్రీనివాస్ దంపతులు, వైస్ ఎంపీపీ బేతు రమాదేవి-రవి దంపతులు, గుడిపేట సర్పంచ్ లగిశెట్టి లక్ష్మి-రాజయ్య దంపతులు సమకూర్చారు. మండలంలోని రేల్‌టెల్ ఇంటర్‌నెట్ నిర్వాహకులు సైకిల్ పోటీల్లో పాల్గొన్న 70 మందికి కూడా పతకాలను అందజేశారు. ఎంపీటీసీ ఒడ్డె బాలరాజ్, ఉప సర్పంచ్ లక్ష్మణ్, మాజీ వైస్ ఎంపీపీ మండపల్లి శ్రీనివాస్, స్థానిక నాయకులు లగిశెట్టి రాజయ్య, బేర పోశం, దొమ్మటి బాపు, పీఈటీలు నరేందర్, మేకల లక్ష్మణ్, యువరాజ్యం స్వచ్ఛంద సంస్థ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

పంటలకు నీరందించాలని రైతుల రాస్తారోకో


రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

లక్సెట్టిపేట: కడెం చివరి ఆయకట్టు వరకు ఉన్న దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల వరి పొలాలకు యాసంగి పంటకు నీరందించాలని మండలాల్లోని రైతులు ఆదివారం సంక్రాంతి పండగ రోజున స్థానిక అంబేద్కర్ చౌరాస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడెం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మండలాలకు రెండు పంటలకు నీరందించేలా చూడాలని, నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం నీటిపారుదల శాఖ అధికారులు వచ్చి చర్యలు తీసుకుంటామని చెప్పడంతో శాంతించారు. జలసాధనసమితి నాయకులు పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో సీపీఎస్ ఉద్యోగుల మహాగర్జన

- రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్

జన్నారం: ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ విధానం రద్దయ్యే వరకు పోరాటం ఆగదని, ఇందులో భాగంగా ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో మహాగర్జన నిర్వహిస్తామని సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్ తెలిపారు. జన్నారంలోని పీఆర్టీయూ భవన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగుల పెన్షన్, గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్, కమ్యుటేషన్ ఇతరత్రా హక్కులను కోల్పోవడానికి కారణం అయిన కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీం (సీపీఎస్) పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రూల్స్ ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. రాజస్థాన్ , పంజాబ్, చత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు పాత పెన్షన్ విధానం అమలు చేస్తున్నాయని తెలిపారు. నాలుగు రోజుల క్రితం హిమచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో కూడా సీపీఎస్ రద్దు చేశారని పేర్కొన్నారు. ఎంప్లాయిస్ ఫ్రెండ్లీ ప్రభుత్వం అని చెప్పుకుంటున్న తెలంగాణ రాష్ట్రంలో సీపీఎస్‌ను రద్దు చేయకపోవడం సరికాదన్నారు. సీపీఎస్ ఉద్యోగుల డీఏ బకాయిలను, పీఆర్సీ, ఎరియర్స్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 317 జీవో ప్రకారం స్థానికతను కోల్పోయిన ఉద్యోగ, ఉపాధ్యాయులను తిరిగి వారి స్థానిక జిల్లాలకు కేటాయించాలన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఫిబ్రవరిలో నిర్వహించే మహాగర్జనకు రాష్ట్రం నలుమూలల నుంచి సీపీఎస్ బాధితులు తరలిరావాలని కోరారు. సమావేశంలో సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు గోళ్ల గంగన్న, గుమ్మడి అంకూస్, రమేశ్, కాంతయ్య, షఫీక్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కమలాకర్

ముంగిట్లో నిరసన ముగ్గు

తాండూర్: సంక్రాంతి పండుగ వేళ మండలంలోని రేచిని పంచాయతీ పరిధిలోని బారేపల్లిలో ముంగిళ్లలో స్థానికులు నిరసన ముగ్గులు వేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఇచ్చిన హామీలను ముగ్గులతో రాశారు. తమ గ్రామానికి రోడ్డు వేయించాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని గతంలో ఆందోళన చేయగా మూడు నెలల్లో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఏడు నెలలైన పరిష్కరించకపోగా, అడిగినవారిపై అక్రమంగా కేసులు పెట్టించాడని, భౌతికదాడులు చేయించాడని వివరించారు. రోడ్డు వేయించి ఓట్లువేసి గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోవాలని సూచించారు.


సమస్యలు పరిష్కరించాలని వేసిన ముగ్గు

అ‘పూర్వ’ సమ్మేళనం

జైపూర్: మండలంలోని ఇందారంలో శ్రీనివాస హైస్కూల్ 2001-2002పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగరీత్యా ఆయా ప్రాంతాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులందరూ సంక్రాంతి పండుగపూట ఒక చోట కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను తోటి స్నేహితులతో పంచుకున్నారు. అనంతరం పాఠశాల ప్రధానోధ్యాయులుగా పని చేసిన గందం రాజన్న దంపతులను, ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి బహుమతులతో సత్కరించారు.

